# ఉన్నవాళ్ళ వెక్కిళ్ళు

పంజాబీ కథ

మూలం : శాంత్‌సింగ్ సేఖన్

అమ్మ ఎంత చెప్పినా వినకుండా ''అంబ'' సిటీ బస్సులో కండక్టరు ఉద్యోగంలో చేరింది. తండ్రి ఎప్పుడో గతించాడు. అన్నా — వదినా ఆమెకు గార్డియనులు. వదినగారు—అంబ ఉద్యోగం చేయడానికి ఒప్పుకొంది. భార్య వత్తిడి వల్ల కొంతా — అన్నగారు కూడా అంగీకారానికి రాక తప్పలేదు. వీరిద్దరూ మొగ్గకపోతే — తల్లి మాటకు కొంత విలువుండి అంబ వుద్యోగంలో చేరకుండా మానుకొనేదేమో!

అన్నా, వదినా అలా అంబను ఉద్యోగంలో చేర్పించారన్నంతమాత్రాన వారి కావిడమీద ప్రేమలేదని అర్థం తీయకూడదు. ప్రపంచంలో అన్నలంతా చెల్లెళ్ళమీద ఎంత వాత్సల్యం చూపించగలరో అంత వాత్సల్యం ఈ అన్నకూడా చూపించగలడు. వదినగారు అన్నగారికేమీ తీసిపోదు అంబను గౌరవించడంలో, ప్రేమించడంలో.

ఏ మధ్యతరగతి కుటుంబంలోనో ఆపిల్లను పడెయ్యాలనే ఆపేక్ష వారికి లేకపోలేదు. ఇదీ అదీ అని కాదు — ఏ బట్టల వర్తకమో, లేసుల వ్యాపారమో, చివరికి చెప్పుల దుకాణమో పెట్టుకొని, పదిరాళ్ళ సంపాదించేవాడి చేతిలో పిల్లను పెడితే మనస్సుకి శాంతి లభిస్తుందని వారికి తెలుసు. అలా కాని పక్షంలో ఫస్టుతారీఖునాటికో పచ్చకాగితం ఇంటికి తెచ్చి, దంపతులు సుఖంగా కాలం గడిపే అవకాశం కల్పించే శక్తి గలవాడైనా సరే, పిల్లనిచ్చి కాళ్ళ కడిగి నెత్తిన జల్లుకొందామనే ఆసక్తి వారికి లేకపోలేదు.

కాకపోతే కొంచెం ఖర్మ అడ్డువచ్చింది. అంబ మొఖంనిండా స్ఫోటకపు మచ్చలున్నాయి. అన్నగారు ఏ సంబంధం ఆలోచించినా — ముందుగానే అవతలివారికివిషయం తెలిసి వాకిట్లోకి రావడం మానేస్తున్నారు. అందువల్ల సంబంధాలు కలిసిరాకపోవటం తటస్థించింది. ఈ పుణ్యం మూటకట్టుకొంటున్నవారెవరో ఒకరు వుండి తీరాలి గదా? ఎవరు వారు? ...

ఇంటి ప్రక్కనే వున్న స్వరూప అనే అందకత్తె ఈ ప్రచారభారం అంతా తనమీద వేసుకొందని అంబ గ్రహించింది. గత పద్దెనిమిది సంవత్సరాల నుంచీ స్వరూప — అంబ ముఖాన్ని అనేక రకాలుగా వర్ణిస్తూ, ఎక్కిరిస్తూ వున్న మాట నిజమే. ''వర్షపు జల్లులుపడ్డ నల్లగడ్డ'' అని చాలాసార్లు స్వరూప అంబ సమక్షంలోనే అంటూ వుండేది. అంబకు అరికాలిమంట నెత్తి వచ్చేదాసమయంలో.


అయినా తన అందాన్నిగూర్చి అలాటి ప్రచారం చేశారని ఒకర్ని ఎందుకు దూషించాలనుకొనేది అంబ. ఈ ఆధునిక యుగంలో పెళ్ళికొడుకులు స్వయంగా వచ్చి పిల్లని చూస్తేగాని ఒప్పుకోవడం లేదు. 'మేం రావడమెందుకులే' అనే బుద్ధిమంతు లెక్కడైనా సకృత్తుగా వున్నా ... ఆయనకు బదులు ఆ ఇంటినుంచి ఒక ఆడపటాలం బయలుదేరుతుంది పిల్లని చూడటానికి... పూర్వాచారాలమీద విశ్వాసం, కొంచెం వుండటంవల్ల అంబను పెళ్ళికుమాళ్ళకు చూపించడమనేది జరగలేదు గాని — చాలామంది ఆడవాళ్ళు వచ్చి చూసిపోతూ వుండేవారు. కాని తోటి స్త్రీమీద జాలి అన్నా లేకుండా —వారంతా అంబను చూచి ముక్కులూ, మూతులూ విరుచుకొంటూ చక్కాపోయారేగాని, ఒక్కరూ ''పిల్లకేం మా అబ్బాయికి చేసుకొంటాం'' అని మాత్రం అనలేదు.

అంతటితో పోయినా కొంత బాగుండును. అందులో ఒకావిడ ''అంబ ముఖం బాగుండకపోవడంతోపాటు — రాక్షసి పళ్ళు అనీ, పొడుచుకొని బైటికి వచ్చాయని వర్ణించడం ప్రారభించింది. ఆవిడేం గొడ్డుబోతు కాదు — నలుగుర్ని కని మోసిన తల్లే! ఇంకో ఆవిడా ఇలా వర్ణనలే చేసింది. ఆవిడేం అందకత్తె కాదు .. ఆవిడముఖం బొత్తిగా కక్కుకొట్టినట్లుంది.. ఆవిణ్ణి చూచి అంబ ''ఓపి! గణాచారీ! నీక్కూడానే నచ్చులా'' అనుకొని వుంటుంది లోలోపల.



ఈ గణాచారి, ఏ పంతులమ్మపనో చేసుకొని బ్రతికేరకంగా లేదు. టైపిస్టుగా పొట్టపోసుకుంటున్నట్టూ లేదు. బస్సు కండక్టరు అంత కన్నా కాదు. కొంచెం జాణగానే కనిపిస్తోంది. దేన్నిబట్టి! వంటినిండా నగలున్నాయి ...: చేతులకీ చెవులకీ, ముక్కుకీ, వ్రేళ్లకీ ... మొత్తం పాతిక తులాల బంగారమన్నా వుంది. ఇంటిదగ్గిర దించి వచ్చిందిగాని ఉండటానికి ఇద్దరు పిల్లలున్నారు. వాళ్లతోపాటు, తన వయస్సుకూడా దాచాలని తంటాలు పడుతుంది కాబోలు ... నీటుగా తయారైంది. ఇంతవరకు పిల్లలుండకపోతే — భర్త ఇంట్లో వుండనిచ్చేవాడా! ఆవిడా బస్సు కండక్టరు వుద్యోగానికి అర్జీ పెట్టవలసి వచ్చేదే! ఇది తలుచుకొని అంబ చిరునవ్వు నవ్వుకొంది.

అంబకి ఇరవై యేళ్లు దాటాయి. అన్నా, వదినా సంబంధాల విషయంలో విసిగిపోయారు. ఉద్యోగంలో చేరి ఒక్క నెలైంది. ఈవేళా అంబ కేంతో పండగ్గా గడిచింది. కాశ్మీరుగేటు నుంచి లోడీ నగర్‌వరకూ బస్సుపోతుంది. అంబ బస్సులో నిలబడి టిక్కెట్లు అమ్మాలి. ప్రయాణీకుల్ని లోపలికి ఆహ్వానించాలి. వారివారి గమ్యాలు రాగానే వీడ్కోలివ్వాలి. ఇంతసేపూ నిలబడి వుండటంవల్ల కాళ్లు బలపాలు కట్టడం ప్రారం



భించాయి. అయినా వుద్యోగం మీద విసుగు పుట్టలేదు.

కాకపోతే, ఎవరైనా ఒక మగ ప్రయాణీకుడు ఆమెవంక కొంటెగా చూసినప్పుడు మాత్రం కొంచెం గర్వం తొంగి చూచేది. చాలామంది ప్రయాణీకులు నడివయస్సులో వాళ్లే! అలాటి వాడొకడు తనవంక చూచినప్పుడు, సన్నగా నకిలించినప్పుడు, స్వరూప జ్ఞాపకం వచ్చేది. తన ముఖాన్ని గూర్చి ఆవిడచేసిన వర్ణనలన్నీ మనస్సులో మెదిలేవి. స్వరూప ఎంత తెలివితక్కువది! నాముఖమలాంటిదైతే వీళ్లెందుకిలా చూస్తారసలు! ...

సరే, అంబ, పడుచువాళ్లామె వంక చూచినప్పుడు, త్వరత్వరగా టిక్కెట్టు చించి వారి చేతిలో పెట్టి లోపలికి పంపుతూ వుండేది. నిజానికి ముసలీ ముతకా జనానికి టిక్కెట్లివ్వడం కన్నా — నడివయస్సు వాళ్లకిచ్చి నాణాలు నమూలు చెయ్యడంలో అంబకి కొంత సంబర మేర్పడింది. వారిప్రక్క నిలబడ్డప్పుడామె తన పడుచుతనాన్ని గుర్తించుకొని గర్వపడుతూ వుండేది.

ఒకరోజున ప్రయాణీకుడొకాయన బస్సులోకి ఎక్కాడు — భార్యాసమేతంగా. భర్త మంచితనం వల్లనో ఏమో ఆమె చెప్పరాని లావై పోయింది. పైగా అయిదుగురు బిడ్డల తల్లి. ఆ మహానీయుడు, భార్యతో అంబను గురించి ఏదో గుసగుసలు ప్రారంభించాడు. అంబ ఒక చెవ్వు అటు పడేసి విన్నది. ''ఇలాటి పడుచుపిల్లల్నిలాటి వుద్యోగాల్లోకి పంపకూడదు.''

''అయితే ఆ అమ్మాయికన్నేళ్లుంటాయని మీ ఉద్దేశ్యం''

''ఎన్నుంటాయే పాపం ... పదహారు పదిహేడు మధ్య.''

''ఇంకా నయం! ఇరవైకి తక్కువుండవు ... ఆ ముఖం తెలియడంలా — ఎంత ముదిరిందో'' అంది.

అంబకామాటలు వినగానే పట్టరాని కోపం వచ్చింది. ఆ లావుపాటి సుందరిని బస్సులోనుంచి బైటకు తోద్దామనిపించింది. కాని ప్రక్కనున్న భర్త అలా చేయడం సహించలేడనీ, బస్సు రూల్సు అంగీకరించవనీ జ్ఞాపకం వచ్చి, ఆ కోపాన్ని అణిచివేసుకొంది.

అంబకు మంచుని, మంచుని కాళ్ల నొప్పులు పుడుతున్నాయని చెప్పాం కాదూ! ఈ విషయంలో ఆమెకో ఉపాయం తట్టింది ... అందులో కొంత చిలిపితనం వున్నమాట నిజమేగాని, అయినా తను చెయ్యబోయే కొంటెతనం తన తండ్రి వయస్సున్నవాళ్లతో గనక ఫర్వాలేదు. ఏమిటా కొంటెతనం? టిక్కెట్టు ఇచ్చేసమయంలో మెల్లగా వారి మీదకు కొంచెం వ్రాలి మంచావడం! ... దానికా దద్దమ్మలు బాధపడలేదు, తప్పుకోలేదు. పైగా లోలోపల మురిసిపోవడం మొదలుపెట్టారు. వారి సంతోషంతో చూస్తే ''ఈ బడుగు శరీరం నీకో బాలీసుగా చెయ్యమన్నా చేస్తాను' అన్నట్లుంది అంబదృష్టికి.

''దరిద్రులు! ముగ్గురు పిల్లలున్నవాడు ... భార్యపోయినవాడు ... ఇక్కడిలా కులుకుతున్నాడు. వీడిదగ్గరికే మా అన్నయ్యవెళ్లి మా చెల్లెల్నిస్తాను చేసుకొంటావా,అని మర్యాదగా అడిగితే '' ఛీ! ఛీ! ఆ మచ్చలముఖం నాకెందుకు పొమ్మంటాడు' అనుకొంది అంబ.

ఒకసారి ఇలాగే నలభై యేళ్లవాడొకడొచ్చాడు. నలుగురు పిల్లల్ని కని భార్య పోయింది. అంబను చూచి ''ముఖంలో మచ్చలకేంగాని, ఇంకొక్క రెండు అంగుళాల ఎత్తుంటే తప్పకుండా చేసుకొనేవాణ్ణి'' అని చక్కాపోయాడు. ఆరోజునుంచి ''నేను పొట్టిదాన్నికూడా కావన్ను'' అనేబాధ ప్రారంభమైంది అంబ మనస్సులో.

ఒకరోజు బస్సులోకి నలభై అయిదు వత్సరాల పెద్దమనిషి ఎక్కాడు. అంబ టిక్కెట్టు చించుతూ, అతనివంక చూచిందొకసారి. ''తన వంక చూస్తూ, తహ తహలాడిపోతున్నాడా వృద్ధుడు'అని గ్రహించిందామె. కొంచెం సూటిగా చూచిందాతని ముఖంలోకి ... మూడు సంవత్సరాల క్రింద తమ ఇంటికి పెళ్లిచూపులకి వచ్చి తన ముఖం బాగాలేదని, మనిషి పొట్టి అనీ, తిరిగి పోయిన ప్రబుద్ధుడే ఆయన. బస్సులో చూచి ఇలా తహతహలాడుతున్నాడు పాపం.

ఈడ్చి చెంపమీద ఒకటి పెట్టి ''ఏమయ్యా పెద్దమనిషి! నా ముఖంలో మచ్చలు పోయాయా? నేను రెండంగుళాలూ పెరిగానా? ... చెప్పు' అని మళ్లీ ఇంకొక్కటి తగిలిద్దామనిపించింది అంబకి. ఇంతలో మహిళామండలి కార్యదర్శి సులక్షణ చెప్పినమాటలు జ్ఞాపకం వచ్చాయి ... ''ఈనాటి యువతీమణులు, సంఘ దౌర్జన్యాన్ని, దురన్యాయాన్ని ఎదిరించడానికి, నీరత్వానికి పోనక్కర లేదు. తగిన ఉద్యోగం సంపాదించి, ఆర్థిక ప్రతిపత్తిని బలపరుచుకోవడం ద్వారానే సంఘానికి బుద్ధిచెప్పొచ్చు'' ...

ఈ వాక్యాలు తలుచుకోగానే అంబ మనస్సులో కొంచెం గర్వం తొంగిచూచింది. అవును, మరి ఆర్థికంగా తను కొంచెం నిలబడగల్గింది. ప్రక్కనున్న ఆ వెర్రిమొగాణ్ణిచూచి నవ్వుకొంటూ అంబ బస్సులోపలికి వెళ్లింది.

'ఉద్యోగం పురుష లక్షణం' అన్నారనుకోండి. ఈ కాలంలో 'స్త్రీ లక్షణం' అని కూడా అనాల్సి వస్తుంది. అంబ ఉద్యోగంలో చేరిన తర్వాత ఆమె ఆరోగ్యం కూడా బాగుపడింది. కష్టపడి పని చేస్తోంది. కడుపునిండా తిండి తినాలనిపిస్తోంది. తిన్నది అరుగుతోంది. ఉద్యోగంలో చేరిన మొదటి వారంలో, కాళ్ల నొప్పులు పెట్టడం అదీ చూచి, 'ఈతిప్పలు నేనెక్కడ పడగలను! దీంతో ఏ జ్వరమో వచ్చి మంచాన పడతానేమో' అనే భయంకూడా వేసింది. పదిరోజులు గడిచిన తర్వాత ఆ విసుగేం కనిపించకపోగా, మంచి ఆరోగ్యంగా వున్నట్లనిపించింది. అంతేకాదు, నమ్మండి, నమ్మక పోండి. ఆవిడ ఇంటికి వెళ్లి అద్దంలో చూచుకొంటే — మచ్చలుకూడా కొంచెం కొంచెం వడిలిపోతున్నట్లు కనిపించాయావిడకి.

మరి, అద్దాన్నికూడా నమ్మలేక తనగోళ్లతో చెక్కిళ్లను తడివి చూచుకొనేది. వ్రేళ్లెందుకు అబద్ధం చెపుతాయి? ముఖాన గుంటలు పూడి పోతున్నమాట నిజమేనని చెప్పాయా వ్రేళ్లు. అసలయినా, గుంటలెంత వరకు పూడాయో ఇంకెంతకాలానికి పూర్తిగా పూడతాయో — ఆ వివరాలన్నీ ఆవిడకెందుకు? ... పెళ్లిమాట తలుచుకొంటేగదా ఆలెక్కలన్నీ, అంటే అసలు జన్మలో పెళ్లి చేసుకోవద్దని ఆవిడ అనుకోవడం లేదు. కాని, ఆవిషయంలో తల బొప్పికట్టి వుంది గనుక — కొంచెం ఆ ఆలోచనలోనుంచి తప్పుకొందామనుకొంది.

మొదటి నెల జీతం చేతికొచ్చింది. అంబకెంత పండగ్గా తోచిందో చెప్పలేం. వందరూపాయలు! అవి పర్సులోపెట్టుకొని ఇంటికి పరుగెత్తుకు వచ్చినప్పుడామెలో తొంగిచూచిన ఆనందం — ఆవిడకు పెళ్లయి, మొదటిబిడ్డ నెత్తుకొని పుట్టింటికి వచ్చినా కూడా — అంత ఆనందం కలిగివుండదేమో! సంపాదించాను గదా అని తనే దాచుకొందా! అలాటి స్వార్థం ఆమెలో లేదు. వాళ్లమ్మకివ్వలేదు. వాళ్లమ్మంటే ప్రేమ లేక కాదు మరి. సంసార బాధ్యతంతా మోస్తున్నది అన్నయ్యా ... వదినాగా! ... అందుకని సరాసరి వదినదగ్గిరికి వెళ్లింది. తనేమిటి — వాళ్లన్నయ్యా అంతే. సంపాదనంతా తెచ్చి 'వదిన' చేతుల్లో పోస్తాడు. వదినే ఆఇంటికి కోశాధికారి.

''ఎందుకమ్మా నాకిచ్చావు. నీ డబ్బు నువ్వు దాచుకో ... ఏ బ్యాంకులోనన్నా వేసుకో. ఆడ బడుచు సొమ్ము అన్నదమ్ములు వాడుకో కూడదమ్మా' అంది వదిన.

''నీకన్న నమ్మకమైన బ్యాంకు నాకెక్కడ దొరుకుతుంది వదినా' అంది అంబ. వదిన ఆవిణ్ణి వెంటనే హృదయానికి హత్తుకొంది. ఆ మచ్చలముఖాన్నే ముద్దులాడింది. అంబకి వదినగారిమీద గౌరవం మరింత ఎక్కువై, మనస్సు ఉక్కిరిబిక్కిరైంది. అవును మరి. సంపాదించేవాళ్లను లోకం గౌరవిస్తుంది. సంపాదించే వాళ్లు లోకాన్ని గౌరవిస్తూ వుంటారు.

అన్నింటికన్నా తమాషా అయిన విషయం ఒకటి చెప్పాలి. ఒకరోజున అంబ ఇంటికి వస్తూ, బస్సులో ప్రయాణంచేసిన ఒక యువతిని వెంటపెట్టుకొని వచ్చింది. ఆమె బస్సుదిగి తన ఇంటికి తాను పోతానంటే, వినకుండా తనవెంట ఇంటికి తీసుకు వచ్చింది అంబ. తను అలసిపోయి రావడం వల్ల, రాగానే సబ్బుతో ముఖం కడుక్కొంది. వెంట వచ్చిన ఆమెకూ కూడా సబ్బు నీళ్లు ఇచ్చింది.

బస్సు రాత్రిపూట వచ్చి కాశ్మీరు గేటువద్ద ఆగి షెడ్డులోకి పోతుంది.అంబ ఇంటికి వస్తుంది. ఆ చివరి ట్రిప్‌లో కనిపించిందా యువతి. బస్సులో

ప్రతిరోజూలాగానే, ఆడవాళ్లూ, పడుచువాళ్లూ ఉన్నచోట నిలబడకుండా, వడివయసున్నవాళ్లున్న చోట నిలబడివుంది అంబ. పైన చెప్పిన ఆవిడ కనిపించింది. 'ఎందాక వెడతావు' అడిగింది అంబ. ఆమె ముఖం విప్పారింది. కళ్లల్లో నీళ్లు మెదిలాయి. పనితొందరలో అంబ ఆమెవంక చూడలేదు. కాని ఆమె ఏదో మాట్లాడాలని ప్రయత్నించడం విన్నది అంబ. అప్పుడటు తిరిగి చూసింది. కత్తిరించే టిక్కెట్టు అలాగే పట్టుకొని 'స్వరూపా'— అంది.

''అంబా! నువ్వీ బస్సులో ఉద్యోగం చేస్తున్నావా'' అంది స్వరూప గొంతు కొంచెం సవరించుకొని.


స్వయంగా చూచి కూడా ప్రశ్నించాలా! స్వరూప బస్సులో టిక్కెట్టు డబ్బులు తీసి ఇచ్చింది. అంబ ముందు వద్దులెమ్మంది. కాని బస్సు తనది కాదుగా. తను పట్టే నౌకరేగా ... ఈ ఆలోచన వచ్చి డబ్బులు తీసుకొంది. అంబకు స్వరూపంటే ఎంతో ప్రేమ. టిక్కెట్టు ఇచ్చి ప్రక్కన కూర్చుంది.

స్వరూప కళ్లనీళ్లు పెట్టుకొంటూ తను ఒంటరిగా పుట్టింటికి వెడుతున్నానని చెప్పింది. అంబ కారణమడిగింది. 'కారణం! ... కారణం .. మగవాడి జీవితం వలపుల తోరణం ... నాభర్త ఇంకో ఆడదాన్ని తెచ్చి ఎక్కడా చోటులేనట్లు ఇంట్లోనే దించాడు. పోనీ అందకత్తా అంటే, అదీ కాదు. పట్టె పాలం పందికుక్క. సరే, ఇంట్లో మంటలు రేగాయి. ఉండలేక నేనిలా బయలుదేరాను'' అంది స్వరూప.

అంబ మనస్సు కరిగిపోయింది. స్వరూపను వెంటబెట్టుకువెళ్లి పుట్టింట్లో దింపి వచ్చింది. ఇంటికి వచ్చేసరికి వదినగారు ఒక వుత్తరం చేతికిచ్చింది. అది ఒక ముప్పయి అయిదేళ్ల ముసలి పెళ్లికొడుకు దగ్గిర నుంచి. ముగ్గురు పిల్లలున్నారుట, మంచి వుద్యోగం వుందిట, అంబమీద మనస్సైందిట.

ఈయ నెవరోకాదు, ఏడాది క్రింద వచ్చి అంబనుచూచి 'నాకీ అంబెందుకు, రంభ కావాలి' అని వెళ్లిపోయిన పెద్దమనిషే! బస్సులో అంబను చూచిన తర్వాత బుద్ధి కొంచెం బదలాయించింది. అందంలేదన్న ముఖంలోనే చందమామ ఉదయించాడు. ఉన్నవాళ్ల చెక్కిళ్లు ఉద్యానవనాలుగా మారిపోతాయా! ...

**అనువాదం : 'రా పూ రు'**



# నీలో

**శ్రీపతి**

పువ్వుకి
నువ్వు రాసుకొనే వుత్తరం.

అబ్బ! యెంత అందం నువ్వు!!

నిన్నెప్పుడూ అనుకరించాలని, నీలా యీ ప్రపంచానికి అతీతంగా, యీ సృష్టిని నిర్లక్ష్యం చేసి, నాకసం నేను బతకాలనుకొంటాను. కాని నన్నలా బతక నివ్వరు. నా ఆకారం కొందరికి వికారం. నేను యెవ్వరినీ ఆకర్షించుకొలేక పోతున్నాను. అందుకే నా బాధ!

మరి నీవో!

ఎన్ని పసి హృదయాలని, యెన్ని మధుర హృదయాలని, తుమ్మెదలని, సీతాకోక చిలుకలని, రాత్రుళ్ళని, యురు సంజలని, జీవులని, చివరికి దేవుణ్ణి ఆకర్షించుకొంటున్నావు!

నీలోని వెలుగు నాలో చూపుకొవడం యెంత కష్టమవుతోందని!

అయినా ఆపరిమళం అందరినీ ఆకర్షించినట్టు, నా మృదువైన అందం ఒక్క హృదయాన్ని తప్పించి యితరులను ఆకర్షించందే!

వశీకరణ శక్తిలా అంధులను సహితం ఆకర్షించే అమూల్య శక్తి నాకు లేదే!

అలా అక్కడే వున్నావు. ఆ కొండల మధ్య మైదానంలో, చెట్లమధ్య నీడల్లో. నువ్వెక్కడికీ కదలవు. అలా నవ్వుతూనే వుంటావు. ఈ కర్కశ లోకాన్ని కూడా క్షమించే నీ విశాల హృదయం, తనలో కలుపుకోవాలని సముద్రం ఉరకలు వేస్తోంది. జాబిలి విరహం భరించలేకపోతున్నది. భానుడు తన యావత్ శక్తితో పోటి పడుతున్నాడు. నిశి వెలుగుమీద కసి పూనింది. తారకలు కనులు మూయటం లేదు.

ఈ సృష్టినంతా యెత్తి తీర్చిన తీవితో ప్రవర్తిస్తున్నావు!

నీకూ నాకూ సంబంధముందని మొదట్లో అనుకొన్నాను. ఈనాడు దూరం తగ్గుతుందని భావిస్తున్నాను. కాని దూరమవుతోన్నట్టు వుంది!

ఏమిటా కబుర్లు—ఆ తుమ్మెద సంగీతానికి బయలా?

ఆ సీతాకోక చిలుకలు బంధువులా?

ఆ కొమ్మల మీంచి, రెమ్మల మధ్య నించి, లేచివురులోని లాలిత్యం పైనుంచి, సర్వ లోకాలలో ఆధిపత్యం చేసిన ఆ భానుడు సన్నగా, మృదువుగా కెంజాయతో నమ్రంగా యెందుకు వస్తున్నాడు?

నేను యెంత ప్రయత్నించీ, విరహపడీ, కలలుగనీ, అందులో అలంకరించుకొనీ, నిన్ను చేరుకోలేక పోతున్నానే!

నా అసమర్థతా?

నా రూపం యెన్ని యవ్వనాలలో, మాతృమూర్తులలో ప్రతి ఫలించి విజయం పొందలేదు?

ఇంతేనా జీవుల పరిధులు?

